భక్తిశ్రద్ధలతో విశ్వాసుల ర్యాలీ

కడప కల్చరల్ : తొమ్మిదిరోజులుగా జరుగుతున్న లూర్దుమాత ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం విశ్వాసులు భక్తిశ్రద్ధలతో ర్యాలీ నిర్వహించారు. కడప నగరం డాన్‌బాస్కో ఐటీఐ ఆవరణలోని చర్చిలో కడప విచారణ గురువులు, చర్చి ఇన్‌ఛార్జి ఫాదర్ జ్ఞాన ప్రకాశ్ సమిష్టి దివ్య బలిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ మానవాళికి మేరిమాత మార్గదర్శకురాలని, ఆమె ద్వారా క్రీస్తును దర్శించుకోవచ్చన్నారు.

– అనంతరం డాన్‌బాస్కో ఐటీసీ విద్యార్థుల ఆధ్వర్యంలో లూర్దుమాత తేరును రంగురంగుల పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆమె స్వరూపాన్ని తేరులో ఏర్పాటు చేసి కడప నగరంలోని ప్రధాన వీధుల ద్వారా మరియాపురం పాత చర్చి వద్దకు ర్యాలీ నిర్వహించారు. శిలువలు చేతబూని ఊరేగింపులో విశ్వాసులు లూర్దుమాత, ఏసు క్రీస్తులను స్తుతిస్తూ నినాదాలతో, క్రైస్తవ భక్తిగీతాలతో ర్యాలీలో పాల్గొన్నారు. మరియాపురం విచారణ గురువు బిరుసు రాజా, సహాయ గురువు కె.చంద్ర, తిరునాల కమిటీ అధ్యక్షులు వారాహి, జోసెఫ్, కోశాధికారి యు.విజయభాస్కర్, కార్యదర్శి పి.లూర్దు, ఫాదర్లు, సిస్టర్లు, యువతీ యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

నేడు తిరునాల

లూర్దుమాత నవదిన ఉత్సవాల్లో భాగంగా శనివారం మరియాపురంలోని పాత చర్చి ఆవరణంలో తిరునాల నిర్వహించనున్నారు. అందులో భాగంగా యువకులకు వాలీబాల్ పోటీలు, చెక్కభజన నిర్వహిస్తారు. మధ్యాహ్నం 2.00 గంటల నుంచి ఆ ఆవరణంలో బండలాగుడు పోటీలు ఉంటాయి. రాత్రి క్రైస్తవ భక్తి కార్యక్రమాలను ఏర్పాటు చేస్తారు.



ప్రత్యేక అలంకరణలో తేరుపై లూర్దుమాత స్వరూపం



వేషధారణ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఘనంగా వార్షికోత్సవం

కడప కల్చరల్ : కడప నగరం హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ కోదండ రామాలయ 23వ వార్షికోత్సవం మూడవరోజు వైభవోపేతంగా నిర్వహించారు. ఉదయం స్వామికి అభిషేకం, ప్రభాత సేవలు, అనంతరం విశేషపూజలు నిర్వహించారు. తర్వాత చిన్నారులు, పెద్దలకు పురాణ వేషధారణ పోటీలు నిర్వహించారు. మూడేళ్ల నుంచి 60 ఏళ్ల వయస్సు గల వారు ఈ పోటీలో ఉత్సాహ భరితంగా పాల్గొన్నారు. సాయంత్రం మహిళలకు సరదా పోటీలు నిర్వహించారు. ఈ మూడు రోజులపాటు నిర్వహించిన వయోజనులు, విద్యార్థుల క్విజ్, ధారణ, వేషధారణ, సరదా, పాటల పోటీల విజేతలందరికీ బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమానికి సహకరించిన పలువురు పెద్దలను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఆలయ ధర్మకర్త డి.వెంకటరెడ్డి పర్యవేక్షణలో శనివారం ఉదయం విష్ణు సహస్ర నామ పారాయణం, అనంతరం విశేష పూజలు నిర్వహించనున్నారు.

వైభవంగా శ్రీరంగనాథస్వామి కల్యాణం

పులివెందుల టౌన్ : పట్టణంలోని పూలంగళ్ల సర్కిల్ వద్ద జరుగుతున్న శ్రీరంగనాథుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా 6వ రోజు శుక్రవారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రధాన అర్చకులు కృష్ణ రాజేష్ శర్మ ఆధ్వర్యంలో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ కల్యాణ వైభోగాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. సతీసమేతుడైన శ్రీరంగనాథుని ముగ్ధమోహన రూపాన్ని చూసి భక్తులు తరించారు. స్వామి కల్యాణాన్ని జరిపించే పురోహితులు మంగళసూత్రాలను భక్తులకు చూపించి స్వామివారి చేతికి తాకించి అమ్మవార్ల మెడలో వేశారు. శాశ్వత కల్యాణ ఉభయదారులు అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంకు చెందిన చల్లా నారాయణస్వామి, ఉమాదేవి కుటుంబ సభ్యులచే కళ్యాణం జరిపించారు. శుక్రవారం సాయంత్రం స్వామివారు సతీసమేతుడై గజ వాహనంపై పట్టణ పురవీధులలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు కాయకర్పూరాలను సమర్పించారు.



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న సతీసమేత శ్రీరంగనాథుడు



శ్రీ రంగనాథుడి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తాదులు

నేడు బ్రహ్మరథోత్సవం : బ్రహ్మోత్సవాలలో భాగంగా 7వ రోజు శనివారం ఉదయం రంగనాథస్వామి బ్రహ్మ రథోత్సవం (తేరు)నిర్వహించనున్నారు. తిరుణాలను తిలకించేందుకు జిల్లా నుండేకాకుండా ఇతర జిల్లాలనుంచి భక్తులు తరలిరానున్నారు. బ్రహ్మరథం ఉత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏర్పాట్లను ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, ఈఓ రమణలు పర్యవేక్షిస్తున్నారు.

11 నుంచి మానవత, నైతికత ఉద్యమం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జమాఅతె ఇస్లామి హింద్ సంస్థ ప్రతినిధులు

కడప కల్చరల్ : జమాఅతె ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి 20వ తేది వరకు రాష్ట్ర వ్యాప్తంగా మానవత నైతికత నినాదంతో జాగృతి ఉద్యమం నిర్వహించనున్నట్లు సంస్థ జిల్లా అధ్యక్షులు ఎస్ఎస్ మోహిద్దీన్ తెలిపారు. శుక్రవారం స్థానిక మస్తాన్‌వలీ వీధిలో ఆయన ఇతర సభ్యులతో కలిసి విలేకరులతో ఈ విషయాన్ని తెలియజేశారు. మనిషిలో నైతిక వర్తన కలిగినపుడు మానవత్వం వికసిస్తుందని, దైవభీతి, జవాబుదారి తనం వల్లనే విలువలు పెరుగుతాయని తెలిపారు. తమ సంస్థ మానవత నైతికత పేరిట ప్రత్యేకంగా ఉద్యమం నిర్వహిస్తోందన్నారు. అనంతరం కార్యక్రమాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనేజేషన్ ఆఫ్ ఇండియా, ఐడియల్ యూత్ మూమెంట్ అధ్యక్షులు జీషాన్, మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ స్థానిక బాధ్యులు పీఎస్ రహమతుల్లా, సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

13న వేలంపాట

కడప అర్బన్: కడప తాలూకా పోలీస్‌స్టేషన్ లో సీజ్ చేసిన మోటార్ సైకిల్‌కు ఆర్టీఓ వాల్యూషన్ ప్రకారం రూ. 5200గా నిర్ణయించారు. ఈ మోటార్ సైకిల్‌ను జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఈనెల 13న కడప డీఎస్పీ కార్యాలయంలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు కడప తాలూకా సీఐ కె. ఉలసయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

అసత్య ప్రచారం తగదు

– ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి యంవి రామచంద్రారెడ్డి

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ వర్గాల నుంచి తనకు వస్తున్న మద్దతు చూసి ఓటమి తప్పదని భావిస్తున్న కొందరు తమ అనుబంధ సంఘాల ద్వారా తప్పుడు ప్రచారానికి శ్రీచారం చుట్టారని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి యంవి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు స్క్రీన్ ప్లే అన్ని రెడీ చేసుకుని కొత్త నాటకానికి తెరలేపారని ఆరోపించారు. వారే కొన్ని బహుమతులను అరేంజ్ చేసుకుని అవి తాము పంచినట్లుగా సోషల్ మీడియాతోపాటు ఇతర మీడియా మాధ్యమాల ద్వారా ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేసిన వారిపై న్యాయపరంగా ఎదుర్కొంటామని ఆయన తెలిపారు.

స్నేహితుడి జ్ఞాపకార్థం వాటర్ ప్లాంటు ఏర్పాటు

వల్లూరు : స్నేహితుడి జ్ఞాపకార్థం చదువుకున్న పాఠశాలలో తోటి స్నేహితులు మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. వివరాల్లోకెళితే.. వల్లూరు మండలంలోని పెద్దపుత్త జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న బ్యాచ్‌కు చెందిన ఆవలూరి గోవర్ధన్‌రెడ్డి నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అతని తోటిస్నేహితులు అతని జ్ఞాపకార్థం తాము చదువుకున్న పాఠశాలలో మినరల్ వాటర్ ప్లాంటును రూ. ఒక లక్షా 20 వేలు వ్యయంతో ఏర్పాటు చేశారు. ఈ ప్లాంటును ఎస్ఐ విష్ణు వర్ధన్ శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. మృతి చెందిన స్నేహితుడి కోసం మిత్రులందరూ కలిసి వాటర్ ప్లాంటును ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం మిత్రులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కడపకు చెందిన బోగా పార్వతమ్మ ట్రస్ట్ వారు వితరణగా అందచేసిన చదువుల తల్లి శ్రీ సరస్వతీ దేవి విగ్రహాన్ని పాఠశాలలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, చైర్మన్ లోకేశ్వర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి మిత్రులు ప్రహ్లాద, రామయ్య, సురేష్, మురళి, శివారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శివకృష్ణ, రామకృష్ణ, వెంకటేశ్వరమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మినరల్ వాటర్ ప్లాంటును ప్రారంభించిన ఎస్ఐ విష్ణువర్ధన్

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ స్టేషన్ల తనిఖీ

చెన్నూరు : ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ బూత్‌లను శుక్రవారం తహసీల్దార్ పఠాన్ అలీఖాన్ తనిఖీ చేశారు. మండల పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను పరిశీలించి పోలింగ్ నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల తూర్పు దిక్కున పట్టభద్రులకు సంబంధించిన 19వ పోలింగ్ బూత్, పడమర వైపున టీచర్స్‌కు సంబంధించిన 18వ పోలింగ్ బూత్‌ను ఏర్పాటుపై పరిశీలించామన్నారు. అలాగే ఫర్నీచర్, లైటింగ్, నీటి వసతులకు సంబంధించి పలు అంశాలను ఆయన ఎస్ఐ శ్రీనివాసులురెడ్డితో కలిసి పరిశీలించినట్లు తెలిపారు. అలాగే ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళి అమలుపై తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో, కార్యదర్శులతో సమావేశం నిర్వహించామన్నారు. కాగా ఇప్పటివరకు 1103 మంది పట్టభద్రులకు సంబంధించి ఓటుహక్కు కోసం నమోదు అయ్యారని, ఉపాధ్యాయులకు సంబంధించి 67 మందిని ఎన్‌రోల్ చేయడం జరిగిందన్నారు. అంతేకాకుండా ఇంకా ఎవరైనా అర్హత కలిగిన వారు ఎన్‌రోల్ చేయాలనుకుంటే ఎన్నికలకు పది రోజుల ముందు వరకు కూడా నమోదు చేసుకోవచ్చని తెలియజేశారు.

స్పర్శ లేని మచ్చలుంటే వైద్య సిబ్బందిని కలవాలి

– అడిషనల్ డీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ

చాపాడు : స్పర్శ లేని, రాగి రంగులో మచ్చలుంటే వెంటనే వైద్య సిబ్బందికి తెలియజేయాలని అడిషనల్ డీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ పేర్కొన్నారు. లెప్రసీ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో వైద్యాధికారి రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీఎంహెచ్ఓ మాట్లాడుతూ విద్యార్థులందరూ తమతో పాటు తమ పరిధిలోని ప్రజలకు ఎవరికైనా ఇలాంటి మచ్చలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. స్పర్శ లేని మచ్చల వలన కుష్టు వ్యాధి వ్యాపిస్తుందని ఇలాంటి మచ్చలను మొదట్లోనే గుర్తిస్తే తగిన చికిత్స అందిస్తామన్నారు. విద్యార్థులు పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది, వైద్య సిబ్బందితో లెప్రసీ నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు.

అనంతరం వంటశాలను పరిశీలించి చేతులకు గ్లౌజులు ధరించాలని పరిశుభ్రత పాటించాలని సూచించారు. పాఠశాలలో మరుగుదొడ్లను పరిశీలించి పలు రకాలైన సలహాలు సూచనలు చేశారు. కస్తూర్బా స్పెషలాఫీరు నాగలక్ష్మీ, డాక్టర్ శ్రీవాణి, ఫిజియోథెరఫీ డాక్టర్ మనోహర్, సీహెచ్ఓలు నాగన్న, రాముడు, సూపర్‌వైజర్ సరస్వతి, ఏఎన్ఎం ప్రవంతి, ఆశలు పాల్గొన్నారు.

విద్య ఉన్నత శిఖరాలకు మార్గం

కాశినాయన : విద్య ఉన్నత శిఖరాలకు మార్గమని జిల్లా సమగ్రశిక్ష పథక అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వరికుంట్ల కస్తూర్బాగాంధీ పాఠశాల, నరసాపురం మోడల్ పాఠశాల, నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గొంటువారిపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలను ఆయన సందర్శించి మాట్లాడారు. పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. అలాగే నాడు–నేడు పనులను పరిశీలించారు. కస్తూర్బాగాంధీ పాఠశాలలో జగనన్న గోరుముద్దను పరిశీలించారు. అనంతరం నరసాపురం ఎమ్మార్సీ భవనాన్ని పరిశీలించి సిబ్బందికి తగు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఏఎల్ఎస్ఓ దశరథరామిరెడ్డి, సీఆర్పీలు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎరువులు అందుబాటులో ఉంచాలి

పెండ్లిమర్రి : రైతు భరోసా కేంద్రాలల్లో రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు కోరారు. మండలంలోని తిప్పిరెడ్డిపల్లె రైతు భరోసా కేంద్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. రైతులకు అవసరమైన ఎరువులు ఉన్నాయా లేదా అని అరాతీశారు. పంట నమోదు, ఈకేవైసీ తప్పని సరిగా చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారిని బ్లెస్సీ, రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

భూ సేకరణ పనుల పరిశీలన

ఓబులవారిపల్లె : మంగంపేట కాలుష్య గ్రామాల తరలింపునకు ఏపీఎండీసీకి కావాల్సిన భూసేకరణ పనులను శుక్రవారం రాజంపేట సబ్ కలెక్టర్ అహ్మద్ ఖాన్ పరిశీలించారు. ముక్కవారిపల్లె రెవెన్యూ పరిధిలోని భూములను వారు పరిశీలించారు. ఏపీఎండీసికి గ్రామాల తొలగింపు కోసం ఇప్పటికే 98 ఎకరాలు భూసేకరణ చేసినట్లు, ఇంకా 38 ఎకరాలు కావాలని ప్రతిపాదించడంతో భూములను పరిశీలించినట్లు సబ్ కలెక్టర్ తెలిపారు. అనంతరం మంగంపేట ఏపీఎండీసీ గనులను సబ్ కలెక్టర్ అహ్మద్‌ఖాన్ వ్యూ పాయింట్ నుంచి సందర్శించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పీర్ మున్నీ, ఆర్ఐ రామ్మోహన్‌నాయుడు, వీఆర్ఓ శివ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

చెన్నూరు : శ్రీ వెంకటేశ్వర హెల్పింగ్ ట్రస్టు ఆధ్వర్యంలో కేఎస్ఆర్ హాస్పిటల్ వారి సహకారంతో చెన్నూరు బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్ తెలిపారు. ఈ మేరకు ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే ఈ శిబిరంలో డాక్టర్ నవీన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బీపీ, షుగర్, థైరాయిడ్, విష జ్వరాలు, మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, గుండె సమస్యలు, కిడ్నీ సమస్యలు, పక్షవాతం, కామెర్లు తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. డాక్టర్ విజయలక్ష్మి మహిళలకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీల్లో క్రీడా పాఠశాల విద్యార్థుల ప్రతిభ

కడప స్పోర్ట్స్: ఫిబ్రవరి 7 నుంచి 9వ తేదీ వరకు శ్రీకాళహస్తిలో నిర్వహించిన 66వ ఎస్‌జీఎఫ్ అండర్–19 రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో వైఎస్ఆర్ క్రీడాపాఠశాల విద్యార్థులు పతకాలు సాధించారు. క్రీడాపాఠశాలకు చెందిన జి.వి.ఎస్. మణిదీప్‌రెడ్డి, (ఇంటర్) ప్రథమ బహుమతి, ఎ. యశ్వంత్ (8వ తరగతి) తృతీయ బహుమతి, ఇండియన్ రౌండ్ విభాగంలో డి. నాగచైతన్య (10వ తరగతి) ద్వితీయ బహుమతి, ఆర్. శ్రీనివాసులు (8వ తరగతి) తృతీయ బహుమతి సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను క్రీడాపాఠశాల ప్రత్యేకాధికారి ఎస్. బాషామొహిద్దీన్ అభినందించారు. కార్యక్రమంలో ఆర్చరీ శిక్షకుడు కె. రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలి

కడప కార్పొరేషన్: విభజన వల్ల తీవ్రంగా నష్టపోయిన రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కెనరా బ్యాంకు ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రానికి తీవ్ర అన్యాయమే జరుగుతోందన్నారు. 2023–24 బడ్జెట్‌ను సవరించి రాయలసీమకు రూ.25వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసి, రాష్ట్రానికి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి వెంకటశివ, జిల్లా కార్యవర్గ సభ్యులు సుబ్రమణ్యం, ఆంజనేయులు, బషీరున్నీసా, గంగాసురేష్, మద్దిలేటి, మనోహర్‌రెడ్డి, సావంత్ సుధాకర్, మల్లికార్జున, భాగ్యలక్ష్మి, బ్రహ్మం పాల్గొన్నారు.

ప్రొబేషన్ డిక్లేర్ చేయాలి

కడప కార్పొరేషన్: రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వార్డు సచివాలయ ఉద్యోగులకు ప్రొబేషన్ డిక్లేర్ చేయాలని ఏపీ ఎన్జీఓ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు హీరా మియా కోరారు. శుక్రవారం జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మను కలిసి వారు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులందరికీ ఈహెచ్ఎస్ వర్తింపజేయాలని కోరారు. కొన్ని కారణాల వల్ల సస్పెండ్ అయి ఆ పీరియడ్ పూర్తయిన వారికి కూడా ప్రొబేషన్ డిక్లేర్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్, సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ కోశాధికారి లక్ష్మయ్య పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పట్ల నిర్లక్ష్యం తగదు

కడప కార్పొరేషన్: మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు ఎస్. రవి, ఇ. ప్రకాష్, తిరుపాల్, గోపి అన్నారు. శుక్రవారం వారు కమిషనర్ ప్రవీణ్‌చంద్‌కు వినతి పత్రం సమర్పించారు. ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసే కార్మికులకు రూ.30వేల వేతనం చెల్లించాల్సి ఉండగా రూ.15వేలు కొందరికి, రూ.18500 మరికొందరికి చెల్లిస్తున్నారన్నారు. ఔట్ సోర్సింగ్ సిబ్బందిని ఎంప్లాయిస్ సైట్‌లో చూపించడం వల్ల వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాలు వర్తించడం లేదన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాల తనిఖీ చేపట్టిన సీఐ నాగరాజు

కడప అర్బన్: కడప నగరంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అన్నమయ్య సర్కిల్ వద్ద వాహనాలను సీఐ ఎన్.వి నాగరాజు ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం తమ సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై సీఐ జరిమానా విధించారు. ప్రతి ఒక్కరూ రికార్డులు వున్న తర్వాతే వాహనాలను నడపాలని సూచించారు.

సుందరేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



జమ్మలమడుగు రూరల్ : మండల పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కన్నెతీర్థంలో 7వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం సుందరేశ్వరస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు హరి హరనాథశర్మ ఉదయం స్వామి వారికి గణపతి పూజ, మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్నదానం, తీర్థ ప్రసాదములు అందజేశారు.

పెద్దదర్గాలో సినీ నటుల ప్రార్థనలు



ప్రార్థనలలో సినీ నటులు ప్రవీణ్‌రాజ్, శీతల్

కడప కల్చరల్: కడప అమీన్‌పీర్ (పెద్ద)దర్గాను శుక్రవారం సినీ నటులు ప్రవీణ్‌రాజ్, శీతల్ తదితరులు దర్శించుకున్నారు. వారికి దర్గా ముజావర్ అమీర్ సాంప్రదాయ బద్ధంగా పేటా చుట్టి దర్గా గురువుల దర్శనం చేయించారు. తొలుత వారు దర్గాలోని హజరత్ పీరుల్లామాలిక్ మజార్‌తోపాటు ఆ ప్రాంగణంలోని ఇతర గురువుల మజార్లను దర్శించుకుని ప్రార్థనలు నిర్వహించారు. దర్గా గురువుల విశిష్టత, చరిత్రను అమీర్ వారికి వివరించారు. ఇటీవల పద్మవ్యూహం తదితర సినిమాల్లో నటించిన తాము పులివెందుల సమీపంలో సినిమా షూటింగ్‌లో పాల్గొన్నామని ఈ సందర్భంగా పెద్ద దర్గా గురించి తెలిసి వచ్చి దర్శించుకున్నామని, తమ అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



జేసీ సాయికాంత్‌వర్మకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు

కడప రూరల్: సచివాలయాల్లో గ్రామ, వార్డు ఉద్యోగులుగా పనిచేస్తున్న వారి సమస్యలను పరిష్కరించాలని ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం స్థానిక నూతన కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ కార్యాలయంలో జేసీ సాయికాంత్‌వర్మకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ప్రభుత్వం సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆ అసోసియేషన్ నాయకులు రవికుమార్, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ కార్యదర్శి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం



మాట్లాడుతున్న నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పత్తూరు గురుస్వామి

కడప రూరల్ : హిందూ దేవాలయాల్లోని పాలక మండలిలో నాయీ బ్రాహ్మణులకు అవకాశం కల్పించడం పట్ల ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పత్తూరు గురుస్వామి హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామన్నారు. శుక్రవారం స్థానిక సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులకు హిందూ దేవాలయాల్లో పాలక మండలిలో అవకాశం కల్పించడం సంతోషంగా ఉందన్నారు. ఇందుకు సంబంధించి జీఓ జారీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, ఆదినారాయణ, రాణా ప్రతాప్ పాల్గొన్నారు.

ఉత్తమ ప్రణాళికలే అభివృద్ధికి సోపానాలు



కెరీర్ గైడెన్స్ పుస్తకాన్ని ప్రదర్శిస్తున్న స్టెప్ అధికారులు

వైవీయూ: విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్తు కోసం చక్కటి ప్రణాళికలు సిద్ధం చేసుకుని వాటిని సోపానాలుగా మలచుకుని అభివృద్ధి సాధించాలని స్టెప్ మేనేజర్ వి.వి. సుబ్బారాయుడు సూచించారు. కడప నగరం మరియాపురంలోని సాంఘిక సంక్షేమ వసతిగృహంలో స్టెప్ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు తమ కెరీర్ పట్ల ఒక అవగాహన, ఒక విజన్ కల్పించాలన్న ఉద్దేశ్యంతో యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. పి. నీలవేణి, వసతిగృహ వార్డెన్ మంజుల, స్టెప్ సిబ్బంది నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కడప టూటౌన్ ఎస్ఐగా జయరాములు



కడప అర్బన్: కడప నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా జయరాములు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో రామాపురంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఎస్ఐగా ఆయన విధులను నిర్వహించారు. తాజాగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టూటౌన్ ఎస్ఐగా విధుల్లో చేరారు.